# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 85 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 26 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 85 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 26 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## కేంద్రంపై అవిశ్వాసం...



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

మణిపూర్ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష కూటమి ఇండియా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భావసారూప్యత కలిగిన ప్రతిపక్షాల నేతల

మిగతా 2లో...

## ఆపరేషన్ ఆకర్ష్‌కు.. గులాబీ వల...!




### కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులపై బీఆర్ఎస్ ఫోకస్

నల్గొండ - ప్రభాత సూర్యుడు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే వివిధ పార్టీల నేతలను పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించింది. అధికార బీఆర్ఎస్ మంత్రి జగదీష్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు వివిధ పార్టీలలో ఉన్న ముఖ్యమైన నాయకులు కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట నల్లగొండ జిల్లాను వరుస ఎన్నికల్లో జయ కేతనం ఎగురవేస్తూ మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కొండగా మార్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకు వివిధ పార్టీలలో మంచి గుర్తింపు ఉన్న నాయకులు, కార్యకర్తలను ఇప్పటికే పార్టీలో చేర్చుకున్నారు. మిగిలిన నేతలు తమ పార్టీకి ప్రయోజన కరంగా ఉంటారు.. అనుకుంటే వెంటనే పావులు కదుపుతూ వారిని పార్టీలలో చేర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ఎన్నికల ఫలితాలు, భట్టి విక్రమార్క పాదయాత్ర, పొంగులేటి ఖమ్మం సభతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు.. వచ్చే ఎన్నికల్లో 12 స్థానాలకు 12 కాంగ్రెస్ గెలుచు కుంటుందని ప్రతిసారి సవాల్ విసురు తున్నారు. కాంగ్రెస్ దూకుడుకు అడ్డుకట్ట వేసే వ్యూహంలో భాగంగానే యాదాద్రి జిల్లా డిసిసి అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని బీఆర్ఎస్‌లో

మిగతా 2లో...

## మళ్లీ ట్రాక్‌లోకి బీజేపీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మొన్నటి వరకు కాస్త నెమ్మదించిన కాషాయదళం ఇపుడు స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని చాటే యత్నాలను ముమ్మరం చేసింది. అందుకు పార్లమెంటులో ఆ రెండు పార్టీలు దాదాపు కలిసి పని చేస్తున్నట్లుగా సాక్ష్యాలను చూపుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దాకానే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రత్యర్థులుగా నటిస్తాయని, ఆ తర్వాత కన్వీనియెంట్‌గా కలిసి పోతాయని కమల నాథులు చెబుతున్నారు. దానికి తోడు ఆపరేషన్ ఆకర్ష్‌ని వేగవంతం చేసేందుకు కూడా బీజేపీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. దీనికి అనుగుణంగా శ్రావణ మాసంలో బీజేపీలోకి చేరికలుంటాయని,
ఏకంగా 15 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు

మిగతా 2లో...

## నేడు కార్గిల్ విజయ్ దివస్

- జూలై 26,1999న పాకిస్తాన్ సైన్యంపై భారత సైన్యం విజయం సాధించిన రోజు
- కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన అమరవీరులకు అశ్రు నివాళులు




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కార్గిల్ విజయ దినోత్సవాన్ని జూలై 26న దేశవ్యాప్తంగా నిర్వహి స్తారు. 1999, జూలై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. దేశ

మిగతా 2లో...

## సింగిల్ కార్డులో ప్రజా రవాణా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

**హైదరాబాద్** ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో, ఆర్టీసీ, లోకల్ ట్రైన్స్, క్యాబ్, ఆటో ఇలా ప్రజా రవాణాకు సంబంధించి కామన్ మొబిలిటీ కార్డు తీసుకురావాలని నిర్ణయించింది. హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుంది. ఐటీ పరిశ్రమలో దూసుకుపోతున్న భాగ్యనగరంలో ప్రజా రవాణాను సులభతరం చేయాలని
తెలంగాణ ప్రభుత్వం ని

మిగతా 2లో...

## హైదరాబాద్‌లో భారీ వర్షం

### జులై 27 వరకు కొనసాగనున్న వర్షాలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అతలా కుతలమైన తెలంగాణకు భారత వాతావరణ శాఖ (హైదరాబాద్) మరోసారి రెడ్ అలెర్ట్ ప్రకటిం చంది. జూలై 25 నుంచి తెలంగాణ తూర్పు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మెహబూబ్‌నగర్, నాగర్ కర్నోల్, సిద్దిపేట,

మిగతా 3లో...

## దిశానిర్దేశం లేని విపక్ష పార్టీలు

- దేశం పేరును వాడుకుని ప్రజల్ని తప్పుదోవ పట్టించలేరు
- ఓడిపోయి, అలసిపోయి, ఆశలేని మిగిలిపోయిన విపక్షాలు
- విపక్షాల పై నిప్పులు చెరిగిన ప్రదాని మోడీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఇటీవల విపక్ష పార్టీలు తమ కూటమి పేరును ఇండియాగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇండియా అంటే ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇన్‌క్లూజివ్ అలియన్స్. మొత్తం 26 విపక్ష పార్టీల కలయికే ఇండియా అని ఇటీవల జరిగిన బెంగుళూరు భేటీలో కాంగ్రెస్ నేత ఖర్గే పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే కొత్తగా ఏర్పడిన ఇండియా కూటమిని ప్రధాని
మోదీతీవ్రంగా విమర్శించారు. విపక్ష

మిగతా 2లో...

## పాతబస్తీ బీఆర్ఎస్‌లో కుమ్ములాటలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నేతల అంతర్గత కుమ్ములాట తారస్థాయికి చేరుకుంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి పై సల్లావుద్దీన్ లోధిపై దాడి మరువక ముందే మరో మారు చార్మినార్ వద్ద దాడి చేయడం తీవ్ర కలకలకం రేపుతుంది. చార్మినార్ సాక్షిగా చార్మినార్ నియోకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి పై సల్లావుద్దీన్ లోధి పై మంగళవారం బహదూర్పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి దాడిచేసి గాయపరచడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలలోకి వెళితే ... మైనారిటీ బంధు పథకం కింద లక్ష రూపాయాలు ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల మైనార్టీవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి



మిగతా 2లో...

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా అజిత్ పవార్?



ముంబై- ప్రభాత సూర్యుడు

మహారాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. పార్టీలపై నేతల తిరుగుబాటుతో ఇప్పటికే మహా రాజకీయాలు సంచలనంగా మారాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని రెండు ముక్కలుగా చీల్చిన అజిత్ పవార్ తన వర్గం
ఎమ్మెల్యేలతో కలిసి

మిగతా 2లో...

# నేడు కార్గిల్ విజయ్ దివస్

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని న్యూ ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరిగే వేడుకల్లో దేశ ప్రధాని పాల్గొని అమర జవానులకు నివాళులు అర్పిస్తారు. కార్గిల్ యుద్ధం 1999లో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య జరిగింది. భారత్–పాకిస్థాన్‌ల మధ్య మే 8న కార్గిల్ యుద్ధం ప్రారంభమైంది. మనదేశంలోని లడఖ్, ఇతర సరిహద్దుల వద్ద ఉన్న వాస్తవాధీన రేఖను దాటి పాకిస్థాన్ సైన్యం మనదేశంలోకి ప్రవేశించింది. దీంతో భారత్ యుద్ధం చేసేందుకు సిద్ధమైంది. ఈ యుద్ధం సుమారు మూడు నెలలపాటు సాగింది. 1999, జులై 4న 11 గంటలపాటు సుదీర్ఘ యుద్ధం చేసిన అనంతరం భారత్ తిరిగి టైగర్‌హిల్స్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోగలిగింది..జులై 26న అప్పటి భారత ప్రధానమంత్రి భారత అటల్ బీహారీ వాజ్‌పాయి ఆపరేషన్ విజయ్(కార్గిల్ యుద్ధం) విజయవంతమైందని ప్రకటించారు. పాకిస్థాన్ దళాలు మనదేశంలో ఆక్రమించిన ప్రాంతాల నుంచి వెనుదిరిగాయని సైన్యాధికారులు వెల్లడించారు. ఈ యుద్ధంలో సుమారు 520 మంది సైనికులు అమరులయ్యారు. ఈ యుద్ధంలో పాల్గొన్నవారిలో నలుగురు పరమవీర చక్ర, తొమ్మిదిమంది మహావీర్ చక్ర, 53మంది వీర్ చక్ర మెడల్స్ అందుకున్నారు. కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు, కార్యక్రమాలు జరుగుతాయి. ప్రజలంతా వాటిలో పాల్గొని సైనికులకు వందనాలు అర్పిస్తారు.

## దిశానిర్దేశం లేని విపక్ష పార్టీలు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు దిశానిర్దేశం లేకుండా ఉన్నాయన్నారు. ఇండియన్ ముజాహిద్దిన్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా లాంటి సంస్థల్లోనూ ఇండియా పేరు ఉందని మోదీ ఆరోపించారు. ఇంతగా దిశలేని విపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రధాని మోదీ ఇవాళ జరిగిన బీజేపీ భేటీలో పేర్కొన్నారని సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, ఈస్ట్ ఇండియా కంపెనీ లాంటి పార్టీలను కూడా విదేశీయులు ప్రారంభించినట్లు ప్రధాని మోదీ విమర్శించారు. దేశం పేరును వాడుకుని ప్రజల్ని తప్పుదోవ పట్టించలేరని ప్రధాని ఆరోపించారన్నారు. ఓడిపోయి, అలసిపోయి, ఆశలేని పార్టీలుగా విపక్షాలు మిగిలిపోయినట్లు ప్రధాని పేర్కొన్నారు.

# సింగిల్ కార్డులో ప్రజా రవాణా

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లో ప్రజారవాణాను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం కామన్ మొబిలిటీ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ మెట్రో రైలు, టీఎస్ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్, క్యాబ్, ఆటో సర్వీసులను అనుసంధానిస్తూ కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి తీసుకురానుంది. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్.. మెట్రో, టీఎస్ఆర్టీసీ అధికారులతో సమావేశం అయ్యారు. సమావేశంలో కీలక నిర్ణయం తీసుకు న్నారు. హైదరాబాద్ మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులు చేపడుతోంది. ప్రజల జీవన విధానాన్ని సులభతరం చేసేందుకు కీలక పథకాలు అందుబాటులోకి తీసుకువస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రజారవాణా వ్యవస్థ మరింత పటిష్ఠంగా మార నుంది. తెలంగాణ ప్రభుత్వం... త్వరలో కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి తీసుకురానుంది. హైదరాబాద్ లో ప్రజా రవాణా వ్యవస్థలో కామన్ మొబిలిటీ కార్డు కీలకంగా మారనున్నట్లు అధికారులు అంటున్నారు. ఆగస్టు రెండో వారం నుంచి కామన్ మొబిలిటీ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తగిన ఏర్పాట్లను పూర్తి చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులను కేటీఆర్ ఆదేశించారు. కామన్ మొబిలిటీ కార్డు ద్వారా మెట్రో రైలు, టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ప్రయాణం సులభతరం కానుంది. మొబిలిటీ కార్డు సక్సెస్ అయితే ఎంఎంటీఎస్, క్యాబ్స్, షేర్ ఆటోలు, రిటైల్ సంస్థలకు ఈ సేవలను విస్తరిస్తామని పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తెలిపారు. నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులో ఉన్న ఇతర నగరాల్లో ఈ కార్డును వినియోగించవచ్చని ఆయన చెప్పారు. ఇకపై ప్రయాణాలకు ఒకే కార్డు ఉపయోగపడుతుందన్నారు. ముందు హైదరాబాద్ నగరంలో కామన్ మొబిలిటీ కార్డు ప్రారంభించి, అనంతరం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రయాణానికి మాత్రమే కాకుండా ఇతర లావాదేవీలకు ఈ కార్డు ఉపయోగపడేలా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసే కామన్ మొబిలిటీ కార్డుతో ఇతర మెట్రో నగరాలకు వెళ్లినప్పుడు అక్కడి ఆర్టీసీ బస్సులు లేదా మెట్రో రైల్ ఇతర ప్రజా రవాణా వ్యవస్థను ఎలాంటి సమస్యలు లేకుండా సులభంగా వినియోగించేందుకు వీలు కలుగుతుందని అధికారులు అంటున్నారు. ఈ కార్డును ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా తెలంగాణ సర్కార్ జారీ చేసే కామన్ మొబిలిటీ కార్డుకి ఒక పేరు సూచించాలని కోరారు.

## ఆపరేషన్ ఆకర్ష్‌కు

# గులాబీ వల

(మొదటిపేజీ తరువాయి)

చేర్చుకున్నారట. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అనిల్ కుమార్ రెడ్డి ఓటమి చవిచూసినప్పటికీ పార్టీని అంటి పెట్టుకున్నారు. అప్పటినుంచి అనిల్ కుమార్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు మంత్రి జగదీష్ రెడ్డితో పాటు కొందరు ఎమ్మెల్యేలు ప్రయత్నం చేస్తూనే ఉన్నారట. ఈ నేపథ్యంలో తాజాగా కుంభం అనిల్ రెడ్డి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై విమర్శలు గుప్పించి సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న దిగ్గజనేతలంతా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే. దక్షిణ తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ముఖ్య నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో భాగంగానే బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెంచింది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కాంగ్రెస్ హేమాహేమీలైన జానారెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నేతలను ఓడించి కాంగ్రెస్ ను కంగుతినిపించింది. వచ్చే ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాలను తమ ఖాతాలో వేసుకునేందుకు బీఆర్ఎస్ ఇప్పటినుంచి పావులు కదుపుతోంది. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే లక్ష్యంతో గులాబీ అధినేత కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగానే మరికొందరు కాంగ్రెస్ నేతలను గులాబీ దళంలో కలుపుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్ర నేతలు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని ఎన్నికల నాటికి నిర్వీర్యం చేయడం ద్వారా దక్షిణ తెలంగాణపై కాంగ్రెస్ ప్రభావానికి అడ్డుకట్ట వేయవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది.

ఇందులో భాగంగానే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు భువనగిరి నియోజకవర్గంలోని ఎంపీపీలు, సర్పంచులకు గులాబీ కండువా కప్పింది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మరికొందరు కాంగ్రెస్ నేతలను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకునేందుకు మంత్రి జగదీశ్ రెడ్డి పావులు కదుపుతున్నారట. కుంభం అనిల్ కుమార్ రెడ్డి దారిలోనే మరికొందరు కాంగ్రెస్ నేతలు పయనిస్తారని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ఇప్పటికే నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ దిగ్గజనేతలు గులాబీ కండువా కప్పుకుంటారని పలుమార్లు సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ వచ్చే సమయం వరకు చేరికల ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతోంది.

# మళ్లీ ట్రాక్‌లోకి బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీలో చేరతారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈప్రచారంలో వాస్తవమెంతుందో కానీ.. బీజేపీ ఎన్నికల కసరత్తు వేగవంతమైందని మాత్రం చెప్పవచ్చు. ఎన్నికలకు రెడీ అవుతున్న బీజేపీ ఓవైపు ప్రజలను ప్రభావితం చేసే కార్యాచరణను అమలు చేస్తూనే ఇంకోవైపు అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు ప్రారంభించిందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే గెలుపు గుర్రాల జాబితాను బీజేపీ యంత్రాంగం రెడీ చేస్తోన్నట్లు తెలుస్తోంది. మెజారిటీ నియోజకవర్గాలలో ముందుగానే టికెట్లు ప్రకటిస్తే బెటరని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు రెండో వారంలో 119 నియోజకవర్గాలకు ఎమ్మెల్యేల ప్రకటించాలని బీజేపీ యోచిస్తుందని, ఈ అభ్యర్థులంతా వారం పాటు నియోజక వర్గాల్లో మకాం వేయించేలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో దాదాపు అన్ని పార్టీలు అలర్టవుతున్నాయి. ప్రధానంగా టీ.బీజేపీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని వ్యూహ రచన చేస్తున్నట్లు పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. దీనిపై పార్టీలో పెద్ద కసరత్తే జరుగుతోందని వారంటున్నారు. టికెట్లు ఆశించే నాయకులు కూడా ముందుగానే తమ పేర్లను ప్రకటించాలని కోరుతున్నారు. ముందుగానే టికెట్లు కేటాయిస్తే బెటర్ అని ఆశావాహులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అధిష్టానం నియోజకవర్గా ల వారీగా అభ్యర్థుల జాబితాను రెడీ చేస్తోందని సమాచారం. అతి త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించనుంది బీజేపీ హైకమాండ్. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం క్రియేట్ చేస్తోంది. మిగతా రాజకీయ పార్టీల కంటే ముందుగానే రెడీ అవుతోంది. ఎప్పటి నుంచో బీజేపీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రులు తెలంగాణకు రెగ్యులర్‌గా వస్తున్నారు. ఓవైపు ఎన్నికల హడావుడిని క్రియేట్ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందనే సంకేతాలను పంపిస్తున్నారు. అయితే.. ఈ మధ్య రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు.. పార్టీలో నెలకొన్న అనిశ్చితి.. నాయకుల మధ్య విభేధాలు కొంత పార్టీని ఇబ్బంది పెట్టాయి. అంతేకాదు.. పార్టీ క్యాడర్ లో జోష్ ను తగ్గించింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ హైకమాండ్ తెలంగాణపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

119 నియోజకవర్గాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా షాడో టీమ్ ఇదివరకే పర్యటించినట్లు తెలుస్తోంది. దాదాపు మూడు సార్లు సర్వేలు చేయించారని చెబుతున్నారు. ఆ రిపోర్టులు కూడా బీజేపీ అధిష్టానం వద్దకు ఆల్ రెడీ చేరిపోయాయని తెలుస్తోంది. తెలంగాణ సామాన్య ప్రజానీకం బీజేపీ గురించి ఏమనుకుంటున్నారు? ఓటరు నాడి ఎలా ఉంది? రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు? కేంద్ర అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? ప్రభుత్వ తీరుపై ప్రజల ఓపీనియన్ కు సంబంధించిన సర్వే రిపోర్టులు బీజేపీ అధిష్టానం వద్దకు చేరాయి. ఈ రిపోర్టు ఆధారంగా కూడా అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందంటున్నారు. సంస్థాగతంగా చేయాల్సిన పనులు చాలా వున్నాయన్న రీజన్ వల్లే జులై 29న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా సభను ఏర్పాటు చేసి ఖమ్మంలో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ముందుగా తలపెట్టింది. కానీ తాజాగా ఖమ్మం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఖమ్మంకు బదులుగా అమిత్ షా హైదరాబాద్ వస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ వేదికగా బీజేపీ సంస్థాగత అంశాలపై అమిత్ షా సమీక్ష జరుపుతారని, పార్టీ వివిధ విభాగాలలో భేటీ అవుతారని తెలుస్తోంది. ఎన్నికల సన్నాహాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, దానికి అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని దారిలో పెట్టాలని అమిత్ షా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా పర్యటను ఖరారు చేయడంతోపాటు ఆయన వివిధ మోర్చాలతో భేటీ అయ్యే షెడ్యూలుని ఖరారు చేసేందుకు జులై 26న రాష్ట్ర కీలక నేతలు భేటీ కానున్నారు. ఆగస్టు రెండోవారంలో బీజేపీ జాతీయ నేతలు, కేంద్రమంత్రులు తెలంగాణకు పెద్ద ఎత్తున వస్తున్నట్లు తెలుస్తోంది. వారంతా వారం రోజుల పాటు నియోజకవర్గాల్లోనే మకాం వేయనున్నట్లు తెలుస్తోంది. 119 నియోజకవర్గాల్లో జాతీయ నాయకులు సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. వారంతా పార్టీ బలోపేతం కోసం కృషి చేయనున్నారు. పార్టీ ఏ నియోజకవర్గంలో వీక్ ఉంది..? బలోపేతం కావాలంటే ఏం చేయాలి?? వంటి సలహాలు, సూచనలు లోకల్ లీడర్లు, టికెట్లు ఆశించే వారికి చెప్పనున్నారు.

ఇదే రిపోర్టులను అధిష్టానానికి కూడా పంపించనున్నారు. మరోవైపు.. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న వారు చాలా యాక్టివ్‌గా ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్నారు. తాజాగా డబుల్ బెడ్ రూం ఇళ్ళ సందర్శన కోసం చలో బాట సింగారం కార్యక్రమానికి కొత్త అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిస్తే బీజేపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా హంగామా చేశాయి. కిషన్ రెడ్డి అరెస్టు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా గళమెత్తాయి. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జులై 24న తెలంగాణ వ్యాప్తంగా చాలా చోట్ల ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కీలక నేతలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, బూర నర్సయ్య గౌడ్ వంటివారంతా పాల్గొన్నారు. మరోవైపు మహిళా సంఘాలు, యువజన సంఘాలతో బీజేపీ నేతలు తరచూ భేటీ అవుతున్నారు. పార్టీ బలోపేతం కోసం చేయాల్సిన కార్యాచరణపై సీరియస్ గా ఫోకస్ పెడుతున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు.. ఇతర పార్టీల నుంచి వచ్చిన సీనియర్ నాయకులకు ముందుగానే టికెట్లు కేటాయించాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అయితే.. బీజేపీలో మాత్రం అంత ఈజీగా టికెట్లు ఖరారు చేయరు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఖరారు చేసే అవకాశం ఉంది. మొత్తమ్మీద కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దాదాపు రెండు నెలలపాటు స్తబ్ధుగా వుండిపోయిన కమలనాథుల్లో ఇపుడు కదనోత్సాహం కనిపిస్తోంది. అయితే ఇది బలుపా ? లేక వాపా? అన్నది త్వరలోనే తేలిపోనున్నది.

## కేంద్రంపై

# అవిశ్వాసం...

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ సమావేసాలకు ముందు భేటీ అయ్యారు. మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలని ఉభయ సభల్లో డిమాండ్ చేస్తూనే ఉండాలని నిర్ణయించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరుగుతున్న టైంలోనే భావసారూప్యత కలిగిన ప్రతిపక్షాలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత గదిలో సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఇద్దరు అమ్మాయిల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. అయితే ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో మణిపూర్ అల్లర్ల అంశమే కీలకంగా మారింది. దీనిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని ఎంపీలు పట్టుబట్టడంతో ఉభయసభల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. మంగళవారం ఉదయం 11.00 గంటలకు ప్రారంభమైన లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా కొన్ని నిమిషాల్లోనే వాయిదా వేశారు అయితే మణిపుర్ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు పాటుపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మోదీ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జు? ఖర్గే ఛాంబర్‌లో జరిగిన విపక్ష నేతల సమావేశంలో? కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా మణిపుర్ అల్లర్లతో సహా అనేక కీలకమైన అంశాలపై చర్చించే అవకాశం ఉంటుందని విపక్షాల ఆలోచనగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రధాని మణిపుర్‌పై ప్రకటన చేయాలంటూ విపక్షాలు పట్టుబడటంతో వారు వెనక్కి తగ్గుతారని కేంద్రం భావించడం లేదు. దీంతో ఇక బిల్లులు ప్రవేశపెట్టడంపైనే దృష్టి పెడుతున్నట్లు సమాచారం.

## పాతబస్తీ బీఆర్ఎస్‌లో కుమ్ములాటలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర హోంశాఖా మంత్రి మహమూద్ ఆలీ చేతుల మీదుగా మంగళవారం పాలాభిషేకం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర హోంత్రి మహమూద్ ఆలీ కుమారుడు ఆజం అలీ తో పాటు చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి సల్లావుద్దీన్ లోధి తనకార్యకర్తలతో పాటు బహదూర్పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి ఇనాయత్ ఆలీ బాక్రీ తన అనుచరులతో పెద్ద ఎత్తున చార్మినార్ వద్దకు చేరుకున్నారు. కేసీఆర్ చిత్ర పటానికి ఒక వైపు ఇనాయత్ ఆలీ బాక్రీ వర్గం ఉండగా మరో వైపు సల్లాఉద్దీన్ లోధి వర్గం నిలబడింది. హోంమంత్రి కుమారుడు ఆజం కూడా అక్కడే ఉన్నాడు. కాసేపట్లో హోంమంత్రి మహమూద్ ఆలీ అక్కడికి రాబోతున్న తరుణంలో ఆయన దృష్టిలో పడడానికి కార్యకర్తలంతా హంగామా సృష్టించారు. ఈ నేపథ్యంలోనే ఇనాయత్ ఆలీ బాక్రీ కాస్త వెనకకు జరగాలని లోధికి చెప్పాడు. దీంతో కాస్త వెనకకు జరుగగా హోంమంత్రి కుమారుడు ఆజం కూడా నేను కూడా జరుగుతా ... మీరే నిలబడండి అంటూ వెనక్కి వెళ్లి పోవడంతో స్పందించిన ఇనాయత్ ఆలీ బాక్రీ వెళ్లాల్సింది మీరు కాదని... సల్లాఉద్దీన్ లోధి అంటూ దుర్భాషలాడుతూ, వెనక్కి పో అని బెదిరించాడు. వెంటనే నేను ఎందుకు పోవాలని లోధి ప్రశ్నించగా ఆగ్రహించిన ఇనాయత్ ఆలీ బాక్రీ లోధిపై మోచేతితో చాతిలో కొట్టాడు. కింద పడబోయిన లోధిని పక్కనే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు సర్ది చెప్పారు. కార్యక్రమంలో ఎలాంటి గొడవ వద్దని, ఏదైనా ఉంటే ఎమ్మెల్యే క్వార్టర్స్ వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని లోధికి హోంమంత్రి కుమారుడు ఆజం సర్దిచెప్పడంతో వెనక్కి తగ్గినట్టు సమాచారం. కాసేపటికే అక్కడికి చేరుకున్న హోంమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దమణిగింది కానీ వర్గపోరు మాత్రం తారాస్థాయికి చేరుకుందనే చెప్పుకోవచ్చు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా అజిత్ పవార్?

(మొదటిపేజీ తరువాయి)

ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిఫలంగా మహా సీఎం ఏక్‌నాథ్ షిండే అజిత్‌పవార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. అంతే కాకుండా పవార్ వర్గం ఎమ్మెల్యేలు తొమ్మిది మందిని తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. ఈ అనూహ్య పరిణామాలతో మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. ఎక్కడ చూసినా రాష్ట్రంలోని రాజకీయ పరిణామాల గురించే వాడీవేడిగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి మారబోతున్నారంటూ వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే స్థానాన్ని అజిత్ పవార్ భర్తీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. త్వరలో మహా ముఖ్యమంత్రిగా అజిత్‌పవార్ బాధ్యతలు చేపట్టబో తున్నారంటూ ఇప్పటికే వ్యాఖ్యానించారు కూడా. మహా ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ ఇటీవలే మాట్లాడారు. ఆగస్టు 10 నాటికి షిండే స్థానంలోకి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న అజిత్ పవార్ వస్తారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తాజాగా స్పందించారు. అజిత్ పవార్ ముఖ్యమంత్రిగా ఎదగబోరని.. ఏక్ నాథ్ షిండేనే సీఎం పదవిలో కొనసాగుతారని స్పష్టం చేశారు. 'మహాకూటమి నాయకుడిగా నేను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుం టున్నాను. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్ నాథ్ షిండేనే కొనసాగుతారు. ఇందులో ఎటువంటి మార్పు ఉండదు' అని విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.' ఇది సహజం. అయితే, ఆగస్టు 10న జరిగే సంఘటనల గురించి పృథ్వీ బాబా చెప్పిన అంచనాలు నిజం కావు. త్వరలో జరగబోయేది పెండింగ్ లో ఉన్న మంత్రివర్గ విస్తరణ. అందుకోసం సీఎం షిండే తేదీని ఖరారు చేస్తారు' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

# మహానగరాలకు ఏమైంది

ఎటు చూసినా కాలువలు, వాటి మీదుగా పడవల్లో సాగే వ్యాపారం.. చూడ్డానికి చాలా ఆహ్లాదకరంగా అనిపించే వాతావరణం ఇటలీలోని వెనీస్ నగరానికి సొంతం. భారత్‌లోని అనేక నగరాలు ఇప్పుడు వెనీస్‌తో పోటీపడుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రహదారులు కాలువల్లా మారిపోతున్నాయి. కాకపోతే వెనీస్‌లో కాలువలే మార్గాలుగా ఉంటాయి కాబట్టి నీటిలో నడిచే పడవలు, మరబోట్లను వినియోగిస్తుంటారు. భారత నగరాల్లో వర్షం పడ్డప్పుడు మాత్రమే కాలువల్లా మారతాయి కాబట్టి పడవల వినియోగం లేదు. కార్లు, ఇతర వాహనాలే పడవల మాదిరిగా మారిపోయి వర్షపు నీటి వరద ప్రవాహంలో కొట్టుకుపోతుంటాయి. ఇన్నాళ్లు సరైన పట్టణ ప్రణాళిక (అర్బన్ ప్లానింగ్) లేని మెట్రో నగరాల్లో మాత్రమే ఈ పరిస్థితి ఉందనుకుంటే.. తాజాగా గుజరాత్ జునాగఢ్‌లో సంభవించిన వరద బీభత్సం దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాలు కూడా ఇందుకు మినహాయింపు కాదని చెబుతోంది. అసలు వర్షం నగరాల పాలిట శాపంగా ఎందుకు మారుతోంది? గతంలో ఎప్పుడూ లేని రీతిలో అతి తక్కువ వ్యవధిలో అత్యధిక వర్షపాతాన్ని అందజేస్తున్న వాతావరణ పరిస్థితులే కారణమంటూ ప్రకృతిపైకే నింద నెట్టేస్తే సరిపోతుందా?ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు.. చివరకు వర్షాలు అంతగా ఉండని దేశ రాజధాని న్యూఢిల్లీ సైతం వరదలో మునిగి తేలుతోంది. గత రెండున్నర దశాబ్దాల్లో ముంబై (2020), చెన్నై (2018), హైదరాబాద్ (2000 మరియు 2020), బెంగళూరు (2017), సూరత్ (2006), కోల్‌కతా (2007), పూణే (2019) మొదలైన అన్ని మెట్రో నగరాలు భారీ వర్షాల కారణంగా నీట మునిగాయి. కేవలం మెట్రో నగరాలే కాదు, దేశంలోని పట్టణ ప్రాంతాలన్నీ గట్టి వర్షం పడితే నీట ముంపునకు గురవుతున్నాయి. పట్టణ వరదలు పూర్తిగా మానవ తప్పిదాలని, సమర్థవంతమైన వర్షపు నీటి నిర్వహణ, ప్రణాళికతో వరదలను నివారించవచ్చని మనం మర్చిపోయినట్టు కనిపిస్తోంది. దేశ రాజధాని నగరంలో ప్రవహించే యమునా నది ఇప్పటికీ ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తోంది. అందులో కలిసే హిండన్ ఉపనది కూడా వరదతో ఉరకలెత్తుతోంది. యమునా నది చరిత్రలోనే ఎప్పుడూ లేనంత గరిష్ట ఎత్తుకు వరద ప్రవాహం చేరుకుంది. ఇప్పటి వరకు 1978లో నమోదైన 207.49 మీటర్లే ఆల్ టైమ్ హై రికార్డ్ అనుకుంటే, తాజాగా సంభవించిన వరద గరిష్టంగా 208.66 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. దాంతో ఎర్రకోట, మహాత్మ గాంధీ సమాధి ఉన్న రాజ్‌ఘాట్, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కల్గిన ఐటీవో ప్రాంతం సహా అనేక ప్రాంతాలు వరదలో మునిగిపోయాయి.ఈ రుతుపవనాల సీజన్‌లో ఉత్తర, పశ్చిమ భారతదేశం అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలకు ఉత్ప్రేరకంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పశ్చిమదిశ గాలులు తోడవుతుండగా, దక్షిణాదిన ఉన్న భారత ద్వీపకల్పంలో ఆవర్తనాలు, అల్పపీడనాలు తోడవుతున్నాయి. ఫలితంగా కుండపోత వర్షాలతో తక్కువ సమయంలో భారీ వర్షపాతం నమోదవుతోంది. ఉత్తరాదిన ఉత్తర్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, జమ్మూ మొదలైన రాష్ట్రాల్లో వరద పరిస్థితులు ఏర్పడ్డాయి. వందల కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తులు జలసమాధి అయ్యాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఈ సీజన్ వరదల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.ప్రకృతి వైపరీత్యాల వంటి పరిస్థితులు ఏర్పడి భారీ వర్షాలు కురిసినప్పుడు వరద పోటెత్తడం సహజమే. అయితే దేశంలోని పట్టణ ప్రాంతాల్లో సంభవించే వరదలకు కేవలం వైపరీత్యాలు మాత్రమే కారణం కావడం లేదు. ఈ వరదలు పట్టణ ప్రణాళికపై సవాల్ విసురుతున్నాయి. అభివృద్ధిలో పట్టణీకరణను వేరు చేసి చూడలేం. అయితే పట్టణీకరణలో క్రమబద్ధత లేకుండా పోయింది. సాంకేతిక విజయాల వేగంతో సమానంగా మన పట్టణ యంత్రాంగం అభివృద్ధి చెందడం లేదని స్పష్టమవుతోంది. ప్రపంచ స్థాయి నగరాలను నిర్మించడానికి ఉపయోగించే భూమిని వైపరీత్యాలను సైతం తట్టుకునేలా సిద్ధం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవడమే కాదు, ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి వ్యవస్థల్లో కూడా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఏ నగరానికైనా ముందస్తు పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) చాలా అవసరం, కీలకం. కానీ దేశంలో ఎక్కడ చూసినా అత్యంత నిర్లక్ష్యానికి, అవినీతికి నిలయమైన వ్యవస్థ ఏదైనా ఉందంటే అది పట్టణ ప్రణాళిక విభాగమే. పెరుగుతున్న నగర జనాభాకు తగిన ఆవాసాలను ప్రణాళికబద్ధంగా నిర్మించడం అనేది దేశంలోని చండీగఢ్ వంటి కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో తప్ప మరెక్కడా కనిపించదు. ఫలితంగా వర్షపు నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా నగరం బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. వరదలు ప్రత్యక్షంగా మానవ, పశు సంపదకు ప్రాణనష్టాన్ని కల్గించడంతో పాటు ఆస్తినష్టాన్ని కూడా కలుగజేస్తున్నాయి. పరోక్షంగా ఆయా నగరాల్లో ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతోంది. 2017లో బెంగళూరులో సంభవించిన వరదలు కేవలం ఐటీ సెక్టార్‌లో రోజుకు రూ. 200 కోట్ల నష్టాన్ని కల్గించాయని అంచనా వేశారు.ప్రణాళిక లేని పట్టణీకరణ కారణంగా కొండలు, అడవులు, సహజ ప్రవాహాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. వర్షపు నీటిని ఎలాంటి ఆటంకాలు లేకుండా నగరం బయట నదుల్లోకి తీసుకెళ్లి కలపాల్సిన వర్షపు నీటి నాలాలపై, చెరువులపై రాత్రికి రాత్రే కాలనీలు ప్రత్యక్షమైపోతున్నాయి. మురుగు నీటి పారుదల వ్యవస్థల నిర్వహణ కూడా సరిగా ఉండడం లేదు. వాటిలో చెత్త పేరుకుపోవడం వంటి కారణాల వల్ల కూడా వర్షపు నీరు నిలిచిపోయి వరద ముంపు ఏర్పడుతోంది. అందుకే పట్టణ ప్రాంతాల్లో సంభవించే వరదలకు మానవ తప్పిదాలే కారణమని స్పష్టమవుతోంది.పట్టణాల వరదలతో సమస్య ముగిసిపోలేదు. ప్రస్తుతం భారత జనాభాలో 35 శాతం మంది నగరాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి మన జనాభాలో దాదాపు 60 శాతం మంది గ్రామాల వీడి నగరాలకు వలసపోతారని అంచనాలున్నాయి. ఇప్పటికే పట్టణ ప్రాంతాలు పెరిగిన పట్టణీకరణతో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే?నా శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా నగరాలను తీర్చిదిద్దకపోతే మరిన్ని తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాబోయే దశాబ్దంలో ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా, భారత ఉపఖండం సహా ఆగ్నేయాసియాలో తరచుగా వరదలు సంభవిస్తాయని ప్రపంచ బ్యాంక్ నివేదిక సూచించింది. ఈ నివేదికను ఏ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. పట్టణ ప్రణాళిక అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక వ్యాపారంగా మారిపోయింది. ఇందులో రాజకీయ జోక్యాన్ని తగ్గించి శాస్త్రవేత్తలు, పట్టణ ప్రణాళికదారులకు వదిలేయాలి. బ్యూరోక్రసీ కఠినంగా వ్యవహరించాలి. పట్టణ సామర్థ్యం, ఒక నగరం అందుబాటులో ఉన్న నీటి వనరులు, ఇతర వనరుల లభ్యత, రోడ్లు భరించగలిగే ట్రాఫిక్ భారంతో పాటు, శాస్త్రీయమైన, తీవ్రమైన అధ్యయనం చేయాలి. నగరాల మాస్టర్ ప్లాన్‌లలో తరచుగా మార్పులు గందరగోళాన్ని పెంచుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌లు ట్యాంపర్ ప్రూఫ్‌గా ఉండాలి. మార్పులు అనివార్యమైతే శాస్త్రీయ అధ్యయనం ద్వారానే అవి జరగాలి. అధిక వర్షాలు, నదీ ప్రవాహాలను పూర్తిగా నియంత్రించలేనప్పటికీ, మన నగరాల ప్రణాళికలో ప్రగతిశీల శాస్త్రీయ విధానాలను అమలుచేయనంత కాలం వరదలు ఏదో ఒక నగరంలో విధ్వంసం సృష్టిస్తూనే ఉంటాయి. ఆ విధ్వంసాలు ఒక్కోసారి నేరుగా ప్రజల ప్రాణాలు బలిచేస్తాయి. లేదంటే ఆర్థికంగా చంపేస్తాయి.

# మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యం

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం రోజున తారక రామ బస్తీ దవాఖాన, గాంధీనగర్ లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద మహిళలకు అందిస్తున్న వైద్య సేవలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతీ మంగళవారం రోజున మహిళలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు మహిళా వైద్యులచే సేవలు అందించడం జరుగుతున్నదని , వైద్య సేవలు సద్వినియోగం చేసుకొని మహిళలు అందరూ ఆరోగ్య వంతులుగా ఉండాలని అన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం కోసం ఆకు కూరలు, పప్పు దినుసులు, బెల్లం పట్టీలు వంటివి ప్రతిరోజూ తీసుకోవాలని అన్నారు. ప్రతీ మహిళా తప్పనిసరిగా రోజుకు 5 లీటర్ల శుద్ధమైన నీటినీ తాగాలని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండడం వలన కుటుంబం లోని ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉంటారని, తద్వారా కుటుంబానికి సంబంధించిన సేవలు మహిళలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ లో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినీ వేడి చేసి చల్లార్చి వడపోచిన నీటినీ తాగాలని అన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మహిళలకు సూచించారు. ఆసుపత్రుల్లో నీటి నిల్వలు ఉండకుండా శుభ్రంగా ఉంచుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద వైద్య సేవలతో పాటు మందులు అందించాలని అన్నారు.

ఆసుపత్రులలో అవుట్ పేషెంట్ ల సంఖ్య పెంచడంతో పాటు, ఆరోగ్యంపై వారికి వివరించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్, డిప్యుటి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్,పీవో ఎంసీహెచ్ డాక్టర్ జైపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్పందన, డాక్టర్ చైతన్య రాణి, జగిత్యాల గ్రామీణ మండల తహశీల్దార్ నవీన్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

(మొదటిపేజీ తరువాయి)

జనగాం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్‌లలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.జూలై 26న తూర్పు తెలంగాణ, ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు, మధ్య తెలంగాణలో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాక తెలిపింది. హైదరాబాద్, పరిసర జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భాగ్యనగరం హైదరాబాద్‌లో జులై 27న భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌కు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మొత్తం ఆరు జోన్‌లు-చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లిలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. నగరంలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు అంచనా వేశారు. జులై 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తాయని, ఈ మేరకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో తెలంగాణాలో నిజామాబాద్‌లో అత్యధికంగా 464 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో చార్మినార్‌లో 79 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) నివేదించింది. ప్రభుత్వం పలు సూచనలు చేసింది. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. తమ ప్రయాణాలను పక్కాగా ప్లాన్ చేసుకోవాలని సూచించింది. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు హైదరాబాద్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి నగరం అంతటా తీవ్ర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న రోడ్డుతోపాటు నగరంలోని పలు ప్రాంతాలు జలమయమైన సందర్భాలు ఉన్నాయి. దీనిపై చాలా మంది ట్విట్టర్ వినియోగదారులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తమ ఆవేదన, అసంతృప్తిని వ్యక్తం చేశారు. నగరం ఐటీతో పాటు ట్రాఫిక్‌లోనూ బెంగళూరుతో పోటీ పడుతోందని విమర్శించారు. కేవలం గంటసేపు కురిసిన వర్షంతో రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. గంట సేపు వర్షం కురిస్తే భాగ్యనగరం పరిస్థితి ఇదీ అంటూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. బెంగుళూరు, హైదరాబాద్ ట్రాఫిక్‌లను పోలుస్తూ.. హైదరాబాద్ బెంగళూరును దాటేస్తుందంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

**చార్మినార్‌లో అత్యధికంగా 79 మిల్లీ మీటర్లు**

తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో గత 24 గంటల్లో చార్మినార్‌లో అత్యధికంగా 79 మిమీ వర్షపాతం నమోదైంది. అంబర్ పేట్ 71.5, గోల్కొండ 71, బహదుర్ పురా 69.3, సైదాబాద్ 69.3, బండ్లగూడ 67, ఆసిఫ్ నగర్ 65.3, సికింద్రాబాద్ 65, షేక్ పేట్ 64.3, నాంపల్లి 64.3, ఖైరతాబాద్ 63.8, హిమాయత్ నగర్ 62.3, మారేడుపల్లి 55.8, ముషీరాబాద్ 54.3, తిరుమలగిరి 54, అమీర్ పేట్‌లో 52.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

# కళకళలాడుతున్న గోదావరి బేసిన్ జలాశయాలు

- శ్రీరామసాగర్, నిజాంసాగర్ లకు పెరిగిన ప్రవాహాలు
- రైతన్నలకు వరంగా మారిన వర్షాలు
- జోరుగా వ్యవసాయ పనులు



బేసిన్ ప్రాజెక్టు జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల ఉధ్ధృతిలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. గోదావరి పరీవాహక ప్రాంత ప్రాజెక్టులకూ వరద ప్రవాహాలు పెరిగాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు 1,21,008 ఇన్ ఫ్లో ఉండగా... 882 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలకు గాను,63.47 టీఎంసీలు నిల్వఉన్నాయి. ఇప్పటికే నిండిన నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 48,475 క్యూసెక్కులు, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 22.440 క్యూసెక్కుల వరద వస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 5.99 క్యూసెక్కుల వరద వస్తుండగా, 385 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.48 టీఎంసీలకు చేరుకుంది. మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజీకి 5,49,210 క్యూసెక్కుల వరద వస్తోంది. 5.49 లక్షల క్యూసెక్కుల నీటిని 75 గేట్ల ద్వారా వదులుతున్నారు.

సింగూరు ప్రాజెక్టు లో ఇప్పటివరకు 21.48 టీఎంసీల నీరు నిల్వఉంది. పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 11.74 టీఎంసీల నీరు నిల్వఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 17.80 టీఎంసీలు. అదేవిధంగా శ్రీరామ సాగర్ ప్రాజెక్టులో 63.47 టీఎంసీల నీరు నిల్వఉంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 7.60 టీఎంసీలు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.01 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. లోయర్ మానేరు రిజర్వాయర్ లో 24.07 టీఎంసీలు ప్రాజెక్టు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 12.89 టీఎంసీల నీరు నిల్వఉంది. అదేవిధంగా మిడ్ మానేరు రిజర్వాయర్ లో 27.50 టీఎంసీల నీటీ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 15.72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు వరంగా మారాయి. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి.

# స్వచసర్వేక్షన్ 2023కు ప్రజలు సహకరించాలి

## మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్-ప్రభాత సూర్యుడు



తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమానికి మున్సిపాలిటీ ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలు, మెప్మా సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి, స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహన కల్పించారు. గూగుల్ ప్లే స్టోర్ లో డౌన్లోడ్ చేసిన ఎస్ఎస్ 2023 ఓట్ ఫర్ యువర్ సిటీ, స్వచ్ఛత మహువ యాప్ ల ద్వారా ఆగస్టు 15 లోపు ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్లు, ప్రజల సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సారిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, మెప్మా కోఆర్డినేటర్ సుజాత మరియు ఆర్పీలు పాల్గొన్నారు.

సినీ హీరో సుమన్ ప్రశంసలు అందుకున్న

## మంథని షోటోకాన్ కరాటే విద్యార్థులు



మంథని - ప్రభాత సూర్యుడు

సినీ హీరో సుమన్ తల్వార్ నుండి మంథని షోటోకాన్ కరాటే విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ లో జరిగిన జపాన్ కరాటే అసోసియేషన్, షోటోకాన్ కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో మంథని షోటోకాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ పెద్దపల్లి జిల్లా చీఫ్ ఇనిస్ట్రక్టర్ కొండ్రా నాగరాజు ఆధ్వర్యంలో మంథనికి చెందిన 7గురు విద్యార్థులు పాల్గొని అత్యధిక ప్రతిభ ను కనబరచి బ్లాక్ బెల్ట్ సాధించారు. గత ఏడు సంత్సరకాలంగా షోటోకాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ లో శిక్షణ పొందుతూ బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు దొంతుల సాయి దివ్య తేజస్విని, బీర ఆదిత్య తేజ, కంకనాల పవన్, చిధరపు మని దీపిక, దేవన్ష్, వడ్ల కొండ శ్రీ విన్య, మిట్ట ఆశ్విత ల గ్రేడింగ్ టెస్టు పర్యవేక్షణ గా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ షియాన్ రాపోలు సుదర్శన్, తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ నూకల బానయ్య లు పర్య వేక్షినీచారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు కి ముఖ్య అతిథిగా షోటోకాన్ కరాటే చైర్మన్ సినీ హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా విద్యార్థులందరికీ సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సినీ హీరో సుమన్ మాట్లాడుతూ కరాటే వలన విద్యార్థులలో ఆత్మ స్థైర్యం, ఆత్మ రక్షణ, భౌతిక మరియు మానసిక ఒత్తిడిని, దృఢత్వం, క్రమశిక్షణ, పెంపొందించే విధంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో అమ్మాయిలపై జరుగుతున్న దాడులను అరికట్టవచ్చు అని తెలిపారు. బ్లాక్ బెల్ట్ పొందిన విద్యార్థులను సీనియర్ కరాటే మాస్టర్ పర్ష బక్కయ్య, శంకర్ గౌడ్ లు అభినందించారు.

## సుప్రీంను ఆశ్రయిస్తా: ఎమ్మెల్యే వనమా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తన ఎమ్మెల్యే సభ్యత్వంపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్ట్ లో వనమా సవాలు చేయనున్నారు. జన బలంతో, మెజారిటీ ఓట్లతో గెలిచిన వారు ఎమ్మెల్యే. , ప్రజా క్షేత్రంలో గెలవాలి తప్ప, దొంగ కేసులతో, ఒడిన దగ్గర నుంచి, ప్రజల కష్ట సుఖాలు పట్టించుకోకుండా, హైదరాబాద్ కోర్ట్ ల చుట్టూ తిరిగే వారు ఎప్పటికి ఎమ్మెల్యే కాలేరు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుంది, సుప్రీంకోర్టును సంప్రదిస్తా. రెండు రోజుల్లో స్టే వస్తుంది. ఎవ్వరు అధైర్య పడవద్దని అయన అన్నారు.

## మేఘాలయా ముఖ్యమంత్రి ఆఫీస్‌పై ఆందోళనకారుల రాళ్ల దాడి



తురా- ప్రభాత సూర్యుడు: మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ సంగ్మా ఆఫీస్‌పై ఆందోళనకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీంతో తురాలోని సీఎం ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఆందోళనకారుల దాడిలో ఐదుగురు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. తురాలో శీతాకాల రాజధాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు ఆందోళనకారులు సీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయంపై రాళ్లవర్షం కురిపించారు. ఆ సమయంలో సీఎం సంగ్మా ఆఫీసులో ఉండటం గమనార్హం. అయితే ఆయనకు ఎలాంటి హానీ జరగలేదు.ఆందోళనకారులు రోడ్డును దాగ్బందించడంతో సీఎం సంగ్మాతోపాటు ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ మంత్రి ఎన్ మరాక్ కూడా ఆఫీస్‌లోనే ఉండిపోయారు. తురాను శీతాకాల రాజధానిగా చేయాలని డిమాండ్ చేస్తూ గారో హిల్స్‌కు చెందిన వివిధ సంఘాలు గత 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నాయి. దీంతో ఏసీహెచ్ఐకే, జీహెచ్ఎస్ఎంసీ వంటి పౌర సంఘాలతో చర్చలు జరిపేందుకు సీఎం తురా చేరుకున్నారు. ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే ఆందోళనకారులు సీఎం కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. కాగా, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నదని అధకారులు తెలిపారు.

## విమానాశ్రయంలో బంగారం పట్టివేత

రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు: రంగారెడ్డిజిల్లా శంషాబాద్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్, కస్టమ్స్ అధికారులే తనిఖీలు నిర్వహించారు. కస్టమ్స్ అధికారుల కళ్లు గప్పి తప్పించుకుని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన స్మగ్లర్లను అధికారులు అదుపులోకి తీసుకన్నారు. ఎయిర్ పోర్ట్ లోని పార్కింగ్ స్థలంలో అనుమానం తో ఇద్దరు వ్యక్తులను



సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగులు తనిఖీ చేస్తే 45 లక్షల విలువ చేసే 700 గ్రాముల బంగారం గుట్టురట్టు అయింది. ఇద్దరు ప్రయాణికులు షేక్ చందు భాషా, ఫేక్ ఆరిఫ్ భాషాలను ను అదుపులోకి తీసుకొని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. నిందితులు కువైట్ నుండి ఇండిగో విమానంలో హైదరాబాద్ కు బంగారాన్ని తీసుకొచ్చినట్లుగా గుర్తించారు.

# వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవు

## జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాల - ప్రభాత సూర్యుడు





వయోవృద్ధులను వేదించేవారిపై పోలీసు శాఖ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జగిత్యాల డి.ఎస్.పి. వెంకట స్వామి అన్నారు.మంగళవారం జిల్లా సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ ప్రతినిధులు డి.ఎస్.పి.ని కలిశారు. జగిత్యాల డి.ఎస్.పి గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా,మెట్ పల్లి డివిజన్ల ప్రతినిధులు పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపి పట్టు శాలువాలతో సత్కరించారు. వయో వృద్ధుల చట్టం అవగాహన, పిలుపు పుస్తకాలను డి.ఎస్.పి కి బహుకరించారు.ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ సీనియర్ సిటీజన్స్ సమస్యలు డి.ఎస్ ..పి. దృష్టికి తెచ్చారు. డి.ఎస్.పి.వెంటనే స్పందించి మాట్లాడుతూ సీనియర్ సిటీజన్స్ ను వేధింపులకు,నిరాదరణకు గురిచేసే వారి గురించి తమ దృష్టికి తీసుకు వస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు .జగిత్యాల పట్టణానికి చెందిన మేరుగు భూలక్ష్మి కేసులో తగు చర్యలు తీసుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,మెట్ పల్లి డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు,కౌన్సిలర్ ఒజ్జల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, పట్టణ అధ్యక్షుడు సతీష్ రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.యాకూబ్, కోశాధికారి ప్రకాష్, పట్టణ కార్యదర్శి మానాల కిషన్,కన్నాపురం మోహన్,కౌడ సంజీవ్,సింగం గంగాధర్ పాల్గొన్నారు.

## కేసీఆర్ అబద్ధాలు తప్ప.. నిజాలు చెప్పటం లేదు

### హైకోర్టు తీర్పును కూడా ముఖ్యమంత్రి అపహాస్యం చేశారు : ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శలు గుప్పించారు." ముఖ్యమంత్రి కేసీఆర్ అబద్ధాలు తప్ప.. నిజాలు చెప్పటం లేదు. కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన గెస్ట్ లెక్చరర్స్ హామీ నెరవేరలేదు. హైకోర్టు తీర్పును కూడా ముఖ్యమంత్రి అపహాస్యం చేశారు. సెలవులు వస్తే గెస్ట్ లెక్చరర్స్‌కు జీతాలు రావటం లేదు. గెస్ట్ లెక్చరర్స్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాను. అరెస్ట్ చేసిన గెస్ట్ లెక్చరర్స్‌ను తక్షణమే విడుదల చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు 12 నెలల జీతాలు ఇవ్వాలి. కేసీఆర్‌ను ప్రశ్నించినా.. అడుకున్నా సహించరు. దేశ ప్రధాని కార్మికుల కాళ్లు కడుగుతుంటే.. కేసీఆర్ కార్మికులను ఉద్యోగాల నుంచి తీసివేశారు. ఆర్టీసీ సమ్మె చేస్తే అశ్వద్ధామరెడ్డిని ఉద్యోగంలో నుంచి తొలగించాలని ఆదేశించారు. కేసీఆర్ భూములపై కన్నేశారు." అని ఈటల సంచలన ఆరోపణలు చేశారు.

## మణిపూర్ అల్లర్ల ఘటనలో నేరస్థులకు ఉరి శిక్ష వేయాలి

### బిజెపి నేత విజయశాంతి డిమాండ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ బీజేపీలో ఆ పార్టీనేత విజయశాంతి చేసిన ట్వీట్స్ కలకలం రేపుతున్నాయి. మణిపూర్ అల్లర్ల ఘటనలో నేరస్థులకు ఉరి శిక్ష వేయాలని రాములమ్మ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటన యావత్ దేశం సిగ్గుతో తల దించుకునేలా ఉందని విజయశాంతి అన్నారు. అయితే మోదీ ప్రభుత్వాన్ని (ప్రశ్నించేలా విజయశాంతి ట్వీట్ ఉందని సొంత పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. అలాగే తెలంగాణ బీజేపీ చీఫ్‌గా కిషన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మాజీ సీఎం కిరణ్‌ను పిలవటాన్ని కూడా రాములమ్మ తప్పుబట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బహిరంగ సభ నుంచి మధ్యలోనే విజయశాంతి వెళ్ళిపోయారు. బండి సంజయ్‌ను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించటాన్ని కూడా బీజేపీ నేత తప్పుబట్టారు. దీంతో విజయశాంతి తీరుపై బీజేపీ నేతలే చర్చించుకునే పరిస్థితి నెలకొంది. స్వపక్షంలో విపక్షం మాదిరి విజయశాంతి వ్యవహరిస్తున్నారని కమలం పార్టీలో నేతలు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

## కొడుకును చంపి...

# భార్యభర్తల ఆత్మహత్య

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మురళీధరన్ శైలజ దంపతులు.. ఈ అన్యోన్య దంపతులకు ఏకైక సంతానం జీవా.. జీవా వయస్సు ఏడేళ్లు.. కొడుకు భవిష్యత్తు కోసం ఎన్నో ఆలోచనలు పెట్టుకున్నారు.. ఐటి ఉద్యోగం చేస్తున్న మురళీధరన్ కుటుంభం ఆర్ధికంగా కూడా బాగానే ఉంది. కన్యాకుమారిలోని ప్రైమ్ ఏరియాలో నూతన భవనం కూడా కట్టుకున్నారు మురళీధరన్ శైలజ.. మూడు నెలల క్రితమే గృహప్రవేశం కూడా జరిగింది. అంతా బాగానే ఉన్నా.. లోకం పోకడ కూడా తెలియని వయస్సులో ఉన్న కొడుకుని తల్లిదండ్రులే హత్య చేశారు.. రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు పాలలో కలిపి తాగించారు.. ఆతర్వాత దిండుతో మొహంపై ఆదిమిపెట్టి ఊపిరి అడకుండా చేసి హత్యచేశారు. ఆతర్వాత అదే ఇంట్లో శైలజ, మురళీధరన్ దంపతులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చూడముచ్చటగా ఉన్న ఆ చిన్న పిల్లాడిని చంపడానికి బయటవారికే చేతులు రావు.. అలాంటిది తల్లిదండ్రులు వారి చేతులతో ఎలా చంపగలిగారు అంటూ విషయం తెలిసిన వారందరూ బాధపడ్డారు. విషయం తెలిశాక పోలీసులు అక్కడకు చేరుకున్నారు.. విచారణ ప్రారంభించిన పోలీసులకు షాకింగ్ విషయం బయటపడింది.మురళీధరన్ కొడుకు జీవాకి అనారోగ్య సమస్య ఉందన్న విషయం బయటపడింది. మానసిక సమస్య ఉందని చెప్పారు. పరిష్కారం కోసం చాలామంది వైద్యులను కలిశారు తల్లిదండ్రులు.. వైద్యులు కొడుకు మానసిక పరిస్థితి జీవితాంతం ఇలాగే ఉంటుందని చెప్పడంతో తల్లితండ్రులు తీసుకున్న కఠిన నిర్ణయం.. తమ తర్వాత కొడుకు పరిస్థితిని ఊహించుకుని కొడుకును హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలింది.. కొత్తగా కట్టుకున్న ఆశల సౌధం.. ఎన్నో ఆశలు పెట్టుకున్న కొడుకు భవిష్యత్తు.. కొడుకుతో ఊహించుకున్న దంపతుల జీవితం.. అన్నీ ఒక్క నిర్ణయం తో ఇలా విషాదంగా మిగిలింది.

## మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

### విద్యార్థులను ఇబ్బంది పెట్టారని కాంగ్రెస్ నేతల పిర్యాదు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కేటీఆర్ జన్మదినం సందర్భంగా చొప్పదండి నియోజకవర్గంలో చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్,పీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ రెడ్డి,జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి,ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ రెడ్డి ,ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి,అధికార ప్రతినిధులు సంధ్యారెడ్డి, అయోధ్య రెడ్డి, లింగం యాదవ్, వచన్ కుమార్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మొక్కలు చనిపోతున్నాయని చర్యలు తీసుకుంటున్న కలెక్టర్లు చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతుంటే ఏం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, సర్పంచులు 15 రోజుల పాటు పిల్లలను ఇబ్బంది పెట్టి కేటీఆర్ అనే పదం వచ్చే విధంగా కింద కూర్చోబెట్టి ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువగా చదువుతారు. చొప్పదండిలో చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ ను కలిశాము. నేషనల్ చిల్డ్రన్స్ కమిషన్ కు సైతం లేఖ రాస్తామని వెల్లడించారు.

## బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అనర్హత పిటిషన్ విచారణపై సుప్రీంలో బీఆర్ఎస్ ఎంపీకి ఊరట లభించలేదు. అనర్హత పిటిషన్‌పై హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేస్తూ బీబీ పాటిల్ వేసిన పిటిషన్‌ను సుప్రీం తోసిపుచ్చింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎంపీగా బీబీ పాటిల్ గెలుపొందారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందున బీబీ పాటిల్ ఎంపిక చెల్లదంటూ కె.మదనమోహన్ రావు అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రోజువారీ విచారణకు హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను బీబీ పాటిల్ సుప్రీంలో సవాలు చేశారు. బీఆర్ఎస్ ఎంపీ పిటిషన్‌పై ఈరోజు (మంగళవారం) సుప్రీంలో విచారణకు రాగా.. బీబీ పాటిల్ వాదనల్లో మెరిట్స్ లేనందున పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ తీర్పునిచ్చింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215